# నష్టజాతకుడు

నిట్టల శ్రీరామమూర్తి

చెక్కపేడులాంటి మొహం, దానిపైన ఊడ తలు పీకిన తాటిపీకలాంటి జుట్టూ, వియ్యపు రాలి జీళ్లలా విశాలమైన చెవులూ, బుల్లి కోలబిస్కట్టు లాంటి ముక్కూ, ముంజి కన్నుల్లాంటి కళ్లూ, సన్నని బద్దలాంటి ఒళ్లూ, 'డివైడరు'లాంటి కాళ్ళూ, అతికినట్టు వేళ్ళాడే చేతులూ, చిరుగు కుట్టినకుట్లు కనిపించే పాత గ్లాస్కో పంచా, వెలిసిపోయిన పెద్దాపురం సిల్కులాల్చీ— అతను మమ్మల్ని సమీపిస్తూ దూరాన్నుంచే, పరిచయ పూర్వకంగా చిరునవ్వు మొహంపెట్టివచ్చాడు, "ఒరేయ్! ఓ సిగరెట్టుంటే ఇలా పడెయ్యరా" అంటూ. గోపిగాడు సిగరెట్టు టిన్ను తీసి చూసేసరికి ఖాళీ. "సారీ బ్రదర్" అన్నాడు. అతను పక్కజేబులోంచి సగంకాలి ఆరిన బీడీ ముక్క తీసి నోట్లో పెట్టుకొంటూ, "పోనీ, ఆ అగ్గిపెట్టేనా ఇల్లాతే" అన్నాడు, గోపీ వెంటనే అగ్గిపెట్టి తుంటి జేబులోంచి తీసి ఇచ్చేడు. అయితేనేం అదీఖాళీ.

"పోనీలేరా" అంటూ అతనుకొబ్బరితాడుకోసం కిళ్ళీకొట్టు ఎక్కడుందా అని వెతుక్కుంటూ వెళ్ళిపోయాడు.

"చూశావురా, రామం వాడి దురదృష్టం? ఇరవైనాలుగ్గంటలూ, మనదగ్గర సిగరెట్ టిన్, అగ్గిపెట్టి నిండుగా ఉంటాయి. సరీగ్గా వాడూ అడిగేసరికి అంతా ఖాళీ! పూర్ ఫెలో" అన్నాడు గోపీ.

"ఎవరతను?" అడిగాను-దూరంగా లీలగా అదృశ్యమయ్యే అతన్ని చూస్తూ.

"నా చిన్నప్పటి స్నేహితుడు సన్యాసిరావు. వాడి భవిష్యత్తును వూహించిపెట్టినట్లుగా పెట్టారా పేరు వాడి తలిదండ్రులు. నిజంగా జీవితంలో ఉట్టి సన్యాసిగా తయారయ్యాడు" అన్నాడు గోపీ విచారంగా మొహంపెట్టి. ఆ వింతప్రవృత్తిగల మనిషినిగూర్చి ఇంకా తెలుసుకోవాలని కుతూహలం కలిగింది.

"అతన్నిగురించి ఇంకా చెప్పు" అన్నాను.

"వాడు పుట్టిన నెల్లాళ్ళకే తండ్రిని ఇంకో లోకానికి పంపించేడు. చదువులో ఎప్పుడూ క్లాసులో ఫస్టుకాని పరీక్షకి కూర్చునేసరికి చదివిందంతా ఎక్కడికెగిరిపోతుందో చచ్చీ చెడీ ప్యాసయ్యేవాడు. ఒకటి, రెండు ఏళ్లు తప్పేడు కూడానూ" అన్నాడు గోపీ-బాల్యస్మృతుల్తో గంభీరమైన మొహంతో.

"ఇప్పుడేం చేస్తున్నాడు?" అన్నాను.

"ఓ అరడజను ఉద్యోగాలు చేసేడు ఈ రెండేళ్ళలో. ఒక్కదాంట్లో స్థిరత్వంలేదు. ఏపనీ సరీగ్గా చేయలేకపోవటం. ఆఫీసరుతో యుద్ధం, ఆపైని డిస్మిసూ. వాడికి మంచివుద్యోగం ఇప్పించటానికి హేమాహేమీలు ప్రయత్నించి వాడి ధోరణిమూలంగా డౌనుఅయిపోయారు. ప్రస్తుతం చూశావుగా వాడివరస" అని ముగించేడు గోపీ.

...మళ్ళీ అతన్ని కలుసుకున్నది నాలుగు రోజుల తర్వాత. ఈలోగా ఆ వ్యక్తి నామనస్సులో మెదుల్తూనే వున్నాడు. అతణ్ణెందుకో కలుసుకోవాలనిపించింది. ఆ రోజు సాయంత్రం సినీమాకని బయలుదేరేం.

మాతోటి అతనూ తయారయ్యాడు. గోపీ మొట్టమొదట కొంచం చిరాకుపడి మళ్ళీ నా మొహంచూసి "సరేపోదాంపద" అన్నాడు. ముగ్గురం ట్రాం స్టాపు దగ్గర నించున్నాం. పావుగంటైంది. ఓ ట్రాము వచ్చి ఆగకుండానే వెళ్ళిపోయింది కోతుల్లా వేళ్ళాడే క్రిక్కిరిసిన జనంతో. ఇంకో పదినిమిషాలకి మళ్ళీ అదే తంతు. కాళ్లులాగుతున్నాయి. గోపీగాడు ట్రాంమీదా, డ్రైవరుమీదా, కంపెనీమీదా పళ్ళుపటపటకొరుకుతూ ఏంచెయ్యలేక నిస్సహాయంగా ప్రక్కనున్న కిళ్ళీకొట్టుముందరబెంచీమీద చతికిల బడ్డాడు ట్వీడు పాంటు నలుగుతుందేమో అని భయపడుతూనే. మూడో ట్రాం వస్తూంటే ఎలాగా ఆపడని తెలుసుకుని మేం వెంటనే పరుగెత్తి ఎక్కేసాం. అతనుమట్టుకు పరుగెత్తేడు కాని ఎక్కలేకపోయాడు. నేనుదిగిపోతూండడం గమనించి గోపీకూడాదిగేడు యిష్టంలేకపోయినా. ఇంక లాభంలేదని మేము అక్కడికి అరఫర్లాంగు దూరంలో వున్న బస్సుస్టాపుకేసి బయలుదేరేం. మేమూ తీరా సగందూరం నడిచేసరికి ఖాళీగా ట్రాం మాకెదురుగా వచ్చి, ఒయ్యారంగా గణగణ లాగుతూ వెళ్ళిపోయింది. గోపీగాడు ఎంత సీరియస్‌గా చేయిచాచినా అక్కడ "స్టాపు"లేకపోవటంమూలాన్ని డ్రైవరు మహాశయుడు ఆపలేదు. తీరా మేం బస్సుస్టాపు చేరుకునేలోగా మేం చూస్తూండగానే బస్సురావటం వెళ్ళిపోవటం కూడా జరిగింది. సినీమాకు టైం అయిపోతోంది. ఇంక పదినిముషాలుమాత్రమేవుంది. గోపీకీ నాకూ చాలా ఆగర్దాగావుంది సినీమా మొదలెట్టేరేమోనని. అతను గోపీదగ్గర పుచ్చుకున్న సిగరెట్టుని నాదగ్గిరి అగ్గిపెట్టితో వెలిగించి ఎట్టి సంచలనం లేకుండా తాపీగా తీరుబడిగా ఆప్యాయంగా పొగ వదులుతున్నాడు. అతను ఏ ఉద్రేకానికీ లొంగని ఘటంలా కనిపించాడు. ఎదుటిబస్సు రాగానే ముగ్గురం ఎక్కేసాం దాంట్లోనే తిరిగి రావచ్చని. తిరుగుట్రిప్పులో ముందరసీటులో అతను కూర్చున్నాడు. ఇంతలో ఓ ముసలి ఆంగ్లో ఇండియను అతనిప్రక్కనే కూర్చుంది. అతను చీదరింపు మొహంతో కిటికీలోంచి అవతలకిచూస్తూ, కిటికీ వారగా ఒదిగి కూర్చున్నాడు.

"నేను చెప్పలేదట్రా రామం. వాడు వట్టి 'సుడిపాదం'గాడు. వాడితో ప్రయాణమంటే పిల్లిని చంకబెట్టుకు బయలుదేరడమే" అన్నాడు గోపీ.

"పాపం! వాడినేంచెయ్యమంటావు పరిస్థితులల్లావుంటే?" అన్నాను.

"ముందుముందు నీకూ తెలుస్తుందిలే" అన్నట్లు నాకేసి చూసి మౌనం వహించాడు గోపీ.

మేము సినీమాకు చేరుకునేసరికి ఆట మొదలుపెట్టి పావుగంటైంది. హౌస్ ఫుల్! పైగా అది ఆఖరిరోజు. చూడక తప్పదనే గోపీ ప్రయత్నం. ఇంకో సినీమాకిపోయాం. బయలుదేరేక ఏదో ఒకసినిమా చూసితీరాలని గోపీ పట్టుదల. టిక్కెట్లు దొరక్కపోతే ఏ బీచికో పోదామని నా ఊహ. మేము హాలులో కూర్చున్న అరగంటకి లైట్లు ఆరిపోయాయి. కరెంటు ఆఫ్! అసలే ఉక్కగా వుంది. కథ మంచి సీనులో కరెంటుపోయింది. సరే కాస్సేపటికి లైట్లు రానే వచ్చాయి ఫిల్ము ఆఖరి ఘట్టంలో సౌండు ట్రాక్కు పాడైంది. ఆడియన్సు ఏమీచేయలేక ఆవులిస్తూ, కాళ్ళూ చేతులూచాచి, ఒళ్లు విరుచుకుని తమ విసుగును తెలియజేసేరు. మూడు రోజులు ఏకటాకీని ప్రయాణంచేసి చిరాకెత్తిన పాసింజర్లకి వాళ్ళ స్టేషనుకి ఫర్లాంగు ఇవతలగా సిగ్నల్‌దగ్గర అరగంటసేపు రైలు ఆగిపోతే రైలువాళ్ళమీద ఎంతకోపం వస్తుందో అంత ఆగ్రహమూ వచ్చేసింది ఆడియన్సుకి. ఓ అరగంటసేపు కాబిన్‌లో పదిమందీ హడావిడిగా తిరుగుతూన్న చప్పుడూ, మాటలూ అవీ వినిపించేయి. ఎల్లాగైతేనేం బాగు అయింది. సినీమా అయిందనిపించారు. మేమూ బయటికొచ్చేసరికి దగ్గిరదగ్గిర పన్నెండు అయింది. ట్రాంలూ, బస్సులూలేవు. ఇంటికి నడుచుకున్నాం.

"వీడితో ఎక్కడికెళ్లినా ఇంతే, ఏపనీ సవ్యంగా జరగదు ఎల్లాంటి జాతకమోగాని" అన్నాడు గోపీ. అతన్ని తీసుకువెళ్ళిన అపరాధానికి లెంపలేసుకుంటూ, ఏదో అందామనుకున్న నా మాటలు నాలోనే వుండిపోయినాయి గోపీ మొహం చూస్తుంటే. అతనికేసి చూశాను. అతనికా మాటలు వినిపించి ఉంటాయనే నా నమ్మ

కము. కాని అతని ముఖంలో ఏమీ మార్పులేదు. నిశ్చలంగా గోపీ యిచ్చిన సిగరెట్టు (ఎన్నోదో లెక్కపెట్టడం మానేసాను) పీలుస్తూ కూడా వస్తున్నాడు.

...ఆ వేళ నెహ్రూ ప్రసంగం విందామని మూర్తి ఇంటిదగ్గర రేడియో చుట్టూ చేరేం. మంచి క్లైమాక్సులో అతనూ వచ్చేడు "నాతో చెప్పకుండా మీరంతా ఇక్కడే చేరేరా" అంటూ. అతనూ సిగరెట్టు ముట్టించాడు. తాపీగా రేడియో టక్కుమని ఆగిపోయింది. 'కరెంటు ఆఫ్' అన్నాడు గోపీ విసుగ్గా గోపీ విసుగు ఎవరి మీదో అందరికీ తెలుసు. అతనేం మాట్లాడలేదు. అసలు ఏమీ ఎరగనట్లే మామూలుగా నవ్వుతూ వచ్చి కూర్చున్నాడు. అతని మనో నిబ్బరానికి నాకు ఆశ్చర్యం వేసింది. ఎవరేమన్నా ఉలుకులేదు పలుకులేదు. తననిగానట్లూ ఏమీ ఎరగనట్లూ మామూలుగా మాట్లాడుతాడు. ఇంకా ఆ "అన్నవాళ్ళే కాస్త సిగ్గుపడతారు" "అయ్యో, అలా అన్నామే మళ్లీ అతనిలో మామూలుగా మాట్లాడ్డ మెల్లాగా" అని.

"పోనీ పేకాట వేద్దాం" అన్న మూర్తి సలహాకి అందరం అంగీకరించాం. నేనూ మూర్తీ ఓ జట్టు అంటూంటే నన్ను తప్పించి తను కూర్చున్నాడు గోపీ. నేనూ అతనూ ఓ జట్టుఅయ్యాం. అతనికి మంచి ముక్క ఓహాటీ పడదే, ఆ రోజు నాకు అయిదు రూపాయలు క్షవరమయ్యాయి. గోపీ మాటలు నిజమేమో అనిపించాయి. పేకాట మానేసి బీచికి బయలుదేరేం.

"కాఫీ తాగి మరీ పోదాం" అంటూ హోటల్లోకి దూరేడు- అతను తనేదో పెద్ద ఇప్పించేవాడిలా వెనకాలే నడిచాం మేము.

"స్వీటు ఏముంది?" అన్న గోపీ ప్రశ్న.

"అంతా అయిపోయింది సార్" అన్న వెయిటర్ క్షమించాలనే నవ్వుమొహం సమాధానం.

"పోనీ నాలుగు మసాల దోసెలు వేయించు" అన్నాడు మూర్తి.

"హాట్ కూడా ఏమీ లేదుసార్ పకోడీ, కారాబూందీ వున్నాయి" అన్నాడు వెయిటర్ జాలిగ మొహంతో.

"అవే నాలుగు ప్లేట్లు ఇలా తగలెయ్యి" అన్నాడు గోపీ.

...మళ్ళీ అతన్ని మంచి తమాషా పరిస్థితులలో కలుసుకోవటం జరిగింది. ఆరోజు మేము అర్జంటుగా వూరికి వెళ్తున్నాం. గోపీకి వెంటనే రమ్మనమని టెలిగ్రాం వచ్చింది వాళ్ళ నాన్నకి సుస్తీగా వుందని. అతడు అకస్మాత్తుగా కనిపించాడు ప్లాటుఫారం మీద. "ఇవాళ మనకి ఇక బండిలో సీటు దొరికినట్లే" అన్నాడు గోపీ నిస్పృహగా. "అసలు బండి టైముకి వస్తేగా" అన్నాను అతనితో వ్యవహారం నాకు అప్పుడే అలవాటై పోయింది. ఆవాళ బండి గంటన్నర లేటు. ఆ లేటు ఫలితం గోపీ అతనికిచ్చిన పది సిగరెట్లూ, నేను అతనికి సమర్పించుకొన్న కాఫీప్రసాదాలు ఖర్చు! ముగ్గురం రైలెక్కాం అతి శ్రమమీద. అతనూ, గోపీ ట్రంకుమీదా, బెడ్డింగు మీదా కూర్చున్నారు. నేను పైబల్ల పట్టుకు నిల్చున్నాను అతను కూర్చోమని లేవబోతూంటే వద్దంటూ. దారిలో చెప్పాడు అత్తవారింటికి వెళ్తున్నానని. అతను, తన స్టేషనురాగానే దిగి వెళ్ళిపోయాడు. వెళ్తూన్న అతని వీపు చూస్తూ అన్నాడు గోపీ,

"శుద్ధ నిష్పుచ్ఛగాడురా, ఎక్కడ కాలు పెడితే అక్కడే విఘ్నం."

మర్నాడు మేం గోపీ తండ్రితోసహా తిరిగి వచ్చేశాము.

అతను బజారులో కనిపించాడు. గోపీ అన్న మాటలు జ్ఞాపకం వచ్చేయి. గోపీ నిలదీసి అడిగాడు, "ఏరా అప్పుడే వచ్చేసేవే?"

"ఏం లేదురా" అన్నాడు మొహమాట పడుతూ.

జీవితంలో ప్రతీక్షణం తగిలే దురదృష్టదేవత విసుర్లకి మొండికెత్తి, మానసిక స్వేచ్ఛతో ఎదిరించి తిరిగే అతనంటే నాకుమట్టుకి ఎంతో గౌరవం కలిగింది.

కాని మా గోపీగాడికి అతనంటే సింహస్వప్నం! అలా అతను దూరంగా, చూచాయగా గోచరించగానే తను ఇలా ఏ గల్లీలోకో దారి తీస్తాడు. ★